‘నీరు’ గారిన లక్ష్యం




కథలాపూర్ మండలం భూషణరావుపేట, తక్కళ్లపెల్లిలో మూసివేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు

- నిర్వహణ లేక మినరల్ వాటర్ ప్లాంట్‌లు మూసివేత
- ప్రైవేట్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు శుద్ధ జలం అందించాలనే లక్ష్యంతో వేములవాడ మాజీ ఎమ్మెల్యే, సేవ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చెన్నమనేని రమేశ్‌బాబు తన సొంత ఖర్చులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని కొన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు, గ్రామపంచాయతీలకు అప్పగించారు. నిర్వాహణ విషయంలో గ్రామపంచాయతీ అధికారులు, సెర్ప్ అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలుగా మూతబడి ఉంటున్నాయి. ఫలితంగా ప్రజలకు కలుషిత నీరు దిక్కవుతున్నాయి. అధికారులు, నిర్వాహకులు కాస్తా చొరవ చూపితే ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందించే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మూతబడిన మినరల్ వాటర్ ప్లాంట్‌ల గ్రామాలు ఇవే...

కథలాపూర్ మండలం భూషణరావుపేట, తక్కళ్లపెల్లి, పెగ్గెర్ల, చింతకుంట గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. రూ. 2 కే 20 లీటర్ల నీరును అందించారు. కొన్ని నెలలు వీటిని మంచిగానే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు తమ నీటి దందాను కొనసాగించేందుకు పలుకుబడి ఉపయోగించడంతో దాతలు ఇచ్చిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు మూసివేసే పరిస్థితులకు దారి తీశాయనే ఆరోపణలున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు రూ. 5 కే 20 లీటర్లు, రూ. 40కి 20 లీటర్ల కూల్ వాటర్ అందించే వ్యాపారానికి పరోక్షంగా సహకారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సెర్ప్ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు చొరవ చూపి ప్రజలకు మంచి నీరు అందిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లు యథావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు, మంచిర్యాల జిల్లా జన్నారం వరకు సాగే ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు విస్తరించాయి. అధికారులు వీటిని తొలగించడానికి చర్యలు తీసుకోకపోవడంతో వర్షాలకు పెరిగిపోయి ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వడం సాధ్యం కావడం లేదని వీటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజయ్య, ఏఈ, ఆర్అండ్‌బీ శాఖ, సెల్ నంబర్: 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

పోలీస్ సేవ మహత్తర బాధ్యత



నూతన డీఎస్పీలను అభినందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీస్ సేవ ఒక మహత్తరమైన బాధ్యత అని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన అభ్యర్థులు ఇటీవల వెలువడిన గ్రూప్ -1 ఫలితాల్లో డీఎస్పీలుగా ఎంపికైన విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతిభను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సేవ ఒక మహత్తరమైన బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే నిజమైన విజయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, ఎస్పీ సీసీ ఆరిఫ్ అలీఖాన్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

జగిత్యాల: సీఎం సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 15 మందికి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గట్టు సతీశ్, తేలు రాజు, ఆనందరావు, మల్లేశం, సాగర్‌రావు, సత్యంరావు, దయాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో నూతన కోర్టు భవనం ఏర్పాటు చేయాలి



ఏజీపీని కలిసిన న్యాయవాదులు

ధర్మపురి: ధర్మపురిలోని కోర్టు అభివృద్ధి, నూతన కోర్టు భవనం ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాదులు బుధవారం ఏజీపీ ఓంప్రకాశ్, టీపీసీసీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ ఎండీ సలీంలను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి, నూతన కోర్టు భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుక వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీకాంత్ కుమార్, ఉపాధ్యక్షుడు బందెల రమేశ్, జాజాల రమేశ్, ఏజీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయంలో అదనపు కలెక్టర్



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ధర్మపురి: ధర్మపురిలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చేపడుతున్న పనుల ప్రగతి, పారిశుధ్యంపై కమిషనర్ శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ సమస్యలు, పారిశుధ్యంపై పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



కోరుట్ల: కోరుట్ల సెగ్మెంట్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్రావులను కలిశారు. అదే విధంగా మొక్కజొన్న కొనుగోలు విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి తుమ్మలను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని రైతులు దళారులను పంటను అమ్మి మోసపోవద్దని జువ్వాడి నర్సింగరావు తెలిపారు.


గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్

జగిత్యాల/గొల్లపల్లి/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి రూరల్/వెల్గటూర్/పెగడపల్లి: పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరి లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామంలో 26 తెలజాతి పశువులకు, 216 గేదెలకు టీకాలు వేశారు. గొల్లపల్లి మండలంలోని తిర్మలాపూర్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ సంతోష్ ప్రారంభించారు. కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలో పశువైద్యాధికారి దివ్యశ్రీ, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్‌లో పశువైద్యాధికారి శైలజ, మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మెర మనీషా పటేల్, పెగడపల్లిలో ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు మండల పశువైద్యాధికారి డా.శ్రీప్రియ ప్రారంభించారు. పాడి గేదెలకు రైతులు ఆరుమాసాలకు ఒకసారి తప్పనిసరిగా టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషక మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఆకుకూరలు, పండ్లు వాటి వినియోగాలు, చిరుధాన్యాల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కిశోర్, సీడీపీవో వాణిశ్రీ, ఏపీడీవో మౌనిక, సూపర్‌వైజర్ లత పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన తల్లులు సరైన పోషకాహారం తీసుకోవడంతో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని సూపర్‌వైజర్ ఉమా తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కాంతమ్మ హసీనా, మమత, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

కథలాపూర్: ఆడ పిల్లలను రక్షిద్దామని అందుకోసం సమాజంలో అందరు సహకరించాలని మెట్‌పల్లి సీడీపీవో మణెమ్మ కోరారు. బుధవారం కథలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి జన్మోత్సవ్ నిర్వహించారు. ఇటీవలే ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సింధూజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఆమె పౌష్టికాహారం పంపిణీచేశారు.అంగన్‌వాడీ టీచర్లు, ఏ ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన దొరగండ్ల గంగాధర్‌కు రూ. 14,500 చెక్కును బుధవారం ఎంఎల్‌సీ ఎల్ రమణ అందజేశారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థినులు



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో జి.యశస్విని, జి.హారిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు మాన్విత్‌రెడ్డి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సోమ మాన్విత్‌రెడ్డి అండర్-14 జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ బోగ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాన్విత్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

క్రికెట్ టోర్నీకి విద్యార్థి ఎంపిక

జగిత్యాల: కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ - 17 క్రికెట్ టోర్నీలో జిల్లా కేంద్రంలోని కేజీఆర్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న మాన్వి అత్యంత ప్రతిభ కనబర్చింది. త్వరలో పెద్దపల్లి జిల్లాలో నిర్వహించబోయే ఉమ్మడి జిల్లాస్థాయి టోర్నీలో పాల్గొనున్నారు. జిల్లా కేంద్రంలోని కిరణ్, హర్షిణి దంపతుల కుమార్తె మాన్వి మొదటి నుంచే క్రీడా పోటీల్లో చురుకుగా ఉంటుంది.

ఎమ్మెల్యే సహకారంతో ఇంటికి చేరిన గల్ఫ్ బాధితుడు

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన అంకం గజేందర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి, అక్కడే బ్రెయిన్ స్ట్రోక్స్ చికిత్స పొందుతుండగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో బుధవారం ఇంటికి చేరాడు. దుబాయ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్నాడని, స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు సహకరించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే సత్యం, బాధితుడు గజేందర్‌ను ఇంటికి తీసుకురావడానికి సహకరించారని కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అడవుల్లో అగ్రికల్చర్ విద్యార్థుల పర్యటన

జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగంగా బుధవారం సారంగాపూర్ అడవుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పుతూ, అటవీ ప్రాంతంలో పర్యాటకులు పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించారు. రోడ్డు వెంట వెళ్లేవారికి ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి.రత్నాకర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ అర్చనలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల: ధాన్యం కొనుగోలు కనీస మద్దతు ధర పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని, సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మద్దతు ధర అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

కుంట కబ్జా చేస్తే చర్యలు తప్పవు

జగిత్యాలరూరల్: కుంటను కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఎస్సారెస్పీ ఈఈ చక్రనాయక్ అన్నారు. బుధవారం సారంగాపూర్ మండలం నాగునూర్‌లోని నాగులకుంటను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పరిశీలించారు. పంటకోతలు పూర్తయిన తర్వాత వెంటనే నాగులకుంటకు హద్దులు ఏర్పాటు చేసి మరమ్మతు చేపడతామన్నారు. ఎవరైనా కుంటను కబ్జా చేసి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయులు

జగిత్యాల: జగిత్యాల జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కన్నెం హరిణిని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లాలో విద్య గురించి తెలుసుకున్నారు.

కొనుగోలు కేంద్రాలపై అవగాహన

కొడిమ్యాల: మండల కేంద్రంలోని సెర్ప్-శ్రీ దుర్గ మండల సమాఖ్య కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వీవోఏలు, బుక్ కీపర్స్, కమిటీ సభ్యులకు బుధవారం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. నిర్వాహకులకు మౌలిక వసతుల ఏర్పాటు, ధాన్యంలో నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్,మండల వ్యవసాయ అధికారి జ్యోతి,మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, ఎపియం మల్లేశం, సీసీలు శ్రీనివాస్,విరాకుమార్, కమలకుమారి,స్వరూప పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇబ్రహీంపట్నం: గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు.మండలం లోని డబ్బా గ్రామంలో బుధవారం పోషన్ మాసోత్సవం నిర్వహించారు. విటమిన్లు, ప్రోటీన్స్ ఉన్న పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవళి, సిబ్బంది పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి

ఇబ్రహీంపట్నం: భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలని ఎంపీడీవో మహమ్మద్ సలీం విద్యార్థులకు సూచించారు. బుదవారం మండలంలోని ఎర్దండిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. తరం ఎర్దండి, బర్దిపూర్, మూలరాంపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి రాజ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, మనోజ్, దివాకర్, ప్రసాద్,పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, కారోబార్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



నివాళులు అర్పిస్తున్న ఎస్సై, గ్రామస్తులు

మేడిపల్లి: మండలంలోని వల్లంపల్లిలో అబ్దుల్ కలాం జ్ఞాన వేదిక - గ్రంథాలయం వద్ద దివంగత మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మన ఊరు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలమ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేడిపల్లి మండల ఎస్సై శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కలాం గారి ఆశయాలను విద్యార్థులు, యువతకు వివరించారు. గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి రూ. 5 వేలు, చేపూరి నాగరాజు రూ.5 వేలు, యువ రియల్ ఎస్టేట్ తరుపున సాయిని గంగారెడ్డి రూ.2 వేలు విరాళం అందించారు.

సీసీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మెట్‌పల్లి రూరల్: కార్డియో పల్మనరీ రీసెర్సిటేషన్(సీపీఆర్)పై ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మెట్‌పల్లి మండల వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు అంజిత్‌రెడ్డి,శివాని అన్నారు.సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీపీఆర్ విధానంపై అధికారులకు,పంచాయతీ కార్యదర్శులకు,సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి,హెల్త్ సూపర్‌వైజర్‌అచ్యుత్‌రావు,తదితరులుపాల్గొన్నారు.

వెల్గటూర్ : సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి డా.తేజశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేస్తే మనిషిని బతికించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎండపల్లి మండల వైద్యాధికారి డా.లవకుమార్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎం జయప్రద తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థికి జాతీయస్థాయి బ్లాక్‌బెల్ట్

ఇబ్రహీంపట్నం : జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన రాగి హర్షవర్ధన్ జాతీయ స్థాయి బ్లాక్‌బెల్ట్ డిప్లమా సాధించినట్లు జిల్లా ప్రధాన కరాటే శిక్షకుడు ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. హర్షవర్ధన్ జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, నటుడు సుమన్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్ అందించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన శిక్షకుడు రాపురు సుదర్శన్, జిల్లా కరాటే శిక్షకుడు ప్రవీణ్‌కుమార్, కరాటే మాస్టర్లు అంజనేయులు, భాగ్యరాజ్, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు వాటర్ ట్యాంకు వితరణ

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం స్థానిక వైద్యుడు గడ్డం రమేశ్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ స్టోరేజీ ట్యాంకును అందించారు. సుమారు 600 మంది విద్యార్థులకు వెయ్యి లీటర్ల స్టోరేజీ స్థామర్యం ఉన్న ట్యాంకును అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు రమేశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు, మద్రి భాస్కర్, ఆల్‌రౌండర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, బొమ్మెన వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లు, మూడు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తహసీల్దార్ వినోద్ బుధవారం తెలిపారు. వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా, ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లు, మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తహసీలార్ పేర్కొన్నారు.

పెగడపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరణ

పెగడపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శశికుమార్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు మల్లాపూర్ ఎంపీడీవోగా ఉన్న శశికుమార్ రెడ్డి నియమించడంతో విధుల్లో చేరారు. కాగా నూతన ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న శశికుమార్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులుకలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా జగదీశ్

మల్లాపూర్: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో తండ జగదీశ్‌ను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో గౌతమ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో జగదీష్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ రాణి, సీనియర్ అసిస్టెంట్ మహేశ్, ఈజీఎస్ ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శులు,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మల్యాల: మండలంలోని నూకపల్లిలో ఈ నెల 17న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహ్మద్ ఇబ్రహీం జ్ఞాపకార్థం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏడీవో సుభాన్ తెలిపారు. నూకపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నామని, అవసరమైన వారికి ఉచితంగా నేత్ర శస్త్రచికిత్స చేయించనున్నామని, మండల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుభాన్ కోరారు.

18న బంద్ విజయవంతం చేయాలి

మెట్‌పల్లి: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 18న నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను మెట్‌పల్లిలో విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ పుప్పాల లింబాద్రి కోరారు. పట్టణంలో బుధవారం బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవో నెంబర్ 9ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య, నల్ల వెంకటేశ్వర్లు, దేవేందర్, తదితరులున్నారు.

కథలాపూర్: బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్ కోరారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. బీసీ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి బంద్ సంపూర్ణంగా ఉండేలా కృషి చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మెట్‌పల్లి: పట్టణంలోని టౌన్-2 పరిధిలో ఉన్న దీన్ దయాళ్‌నగర్, టీచర్స్ కాలనీ, తిరుమల అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దయానంద్ తెలిపారు.